# పాట పయనమైన వైనం

*"నీల వర్ణరార నిన్ను నమ్మితీర*
*జాలమేలరార తాళజాల లేర..."*

తమ్ముడు కొడుకు రాగయ్య పట్నం నించి వస్తున్నాడంటే చెలమయ్యకు మనసులోని సంతోషం తనకలవాటైన పాట రూపంలో గొంతుకలోంచి తన్నుకొస్తోంది. తనకి ఆడపిల్లలే గాని మగపిల్లలు లేరు. కాబట్టి తమ యింటి పేరు నిలిపేవాడు రాగయ్యే! ఒక్కగానొక్క తమ్ముడూ తనలా పల్లెటూళ్ళో పడుండక పట్నం వెళ్ళి ఫేక్టరీలో చేరేడు. నెలనెలా వందల మీద జీతం, పిల్లలకి చదువులూ... మొత్తానికి బాగానే స్థిరపడ్డాడు. రాగయ్య కూడా పట్నంలోనే చదువుకుని ఉద్యోగస్తుడయ్యేడు. అదేం ఉద్యోగమో నెలకి యిరవై రోజులు వూళ్ళమీదేనట. ఎప్పుడన్నా వచ్చినా నాల్రోజులుండి, తోచక వెళ్ళిపోయేవాడు. ఆ తర్వాత అదీ తగ్గిపోయింది.

'పెద్దయ్యా, యీ మధ్య నీ పాట విన్నాను. నిన్ను చూడాలనీ, నీతో మాట్లాడాలనీ అనిపించింది. వచ్చే ఆదివారం మీ వూరొస్తాను' అంటూ ఉత్తరం రాసేడు. ఆ రోజివాళే. అరుగు మీద తుంగచాప మీద కూర్చొని వీధిలోకి చూసేడు చెలమయ్య. ఎంత మొదటి బస్సయినా పందోడిపాలెం జంక్షన్ కొచ్చేసరికి ఏడు గంటలు దాటిపోతుంది. ఎర్రగా ఎండా ఎక్కుతుంది. ఒకప్పుడైతే ఆ మైలు దూరం కాలినడకన రావల్సి వచ్చేది. ఇప్పుడు ఒకట్రెండు రిక్షాలు, జటకాలూ తిరుగుతున్నాయి. ఫర్వాలేదు.

"ఏటి చెలమయ్యా పొలంకి రావేటి" దార్నంటపోతూ గంగు నాయుడు పలకరించేడు.

"లేదులే. మా తమ్ముడి కొడుకొస్తన్నాడియ్యాల పట్నం నించి" చెప్పేడు.

ఉదయం పొలం పని చూసుకోడం, సాయంత్రం రాములారి కోవిల అరుగు మీదికి చేరి రామా, క్రిష్ణా అనుకోడం, రాజకీయాలు చర్చించుకోడం నిత్యకృత్యాలైపోయాయి. ఆ రాములారి దయవల్లే తనిట్లా చల్లగా వున్నాడు. పెద్దదానికి మంచి సంబంధమే కుదిరింది. ఒకరు పెట్టాలన్న ధ్యాస లేదు వారికి. రెండోది కాస్త చదువుకుందేమో పట్నవాసం వైపు మొగ్గు చూపింది. పట్నం సంబంధమే దొరికింది దానికి. ఇద్దరు పిల్లలూ బాగానే వున్నారు.

ఇక తమకా? తిండికి లోట్లేదు. ఉండటానికి ఇల్లుంది. పాడు కోడానికి నోట్లో నలుగురూ మెచ్చే పాట వుంది.

చెలమయ్యను ఆ వూళ్ళో అంతా చెక్కభజన చెలమయ్యనే పిలుస్తారు. చెక్క భజన, చెట్టు భజనల నుండి చిడతల పాటలు, భజన పాటలు... ఇలా ఎన్నోరకాల పాటలొచ్చు చెలమయ్యకి. పుస్తకాల చదువబ్బలేదుగానీ చిన్నప్పుడెప్పుడో నేర్చుకున్న పురాణ కథల్ని పాటల రూపంలో పాటక జనం మెచ్చుకునేలా చెప్పే విద్య మాత్రం బాగానే అబ్బిందతనికి.

జీవనం కోసం వ్యవసాయం; ఆనందం కోసం యీ కథాకార్యక్రమం అనుకుంటాడు.

"ఏం పెద్దయ్యా. పొలానికి పోలేదా" అంటూ గుమ్మంలోకి రాగయ్య వచ్చేవరకూ చెలమయ్య కూనిరాగాలు తీస్తూ వూహా లోకాల్లోనే విహరిస్తున్నాడు.

"పోలేదుగానీ నువ్వేటీ కాలినడకనొచ్చావా? బండి కట్టించు కోలేదూ" అంటూ ఎదురు ప్రశ్న వేసేడు.

"బండి మీదే వచ్చి బజార్లో దిగేను" అన్నాడు రాగయ్య చాప మీద కూర్చుంటూ.

భూలోకమ్మ లోపల్నించి వచ్చి రాగయ్యని పలకరించి తేట మజ్జిగ తీసుకొచ్చి గ్లాసుతో అందించింది.

పల్లెటూళ్ళూ, పంటపొలాలూ, వర్షాభావం, కల్తీ ఎరువులు, రాజకీయాలు - ఇలా చాలా విషయాలు మాట్లాడుకున్నారు రాగయ్య, చెలమయ్య. మధ్యాహ్నం భోజనాలయ్యేక నడవలో పట్టెమంచం మీద దిండు వేసి రాగయ్యను పడుకోమని, తను మడత మంచం మీద కూర్చున్నాడు చెలమయ్య.

"అయితే పెద్దయ్యా నువ్వింకా భజన కార్యక్రమాల్లో పాటలు పాడుతున్నావన్నమాట" అడిగేడు రాగయ్య.

"ఏదో వూరికే కూచోలేక. అయినా గజ్జ కట్టి ఆడే కాలూ, పాట పాడే నోరూ వూరుకుంటాయట్రా. ఎవురో పిలుస్తారు. మనకొచ్చిన కథ ఆటగా పాటగా చెబుతాం. అది జనానికి ఆనందం కలిగిస్తుంది."

"మరి పిల్చినవాళ్ళు డబ్బులేమైనా యిస్తారా."

"హరికథలూ, నాటకాలూ, సిన్మాలూ ఎన్నొచ్చినా యీ కళని పోషించే మారాజులు కూడ వున్నార్లే.." అని, "అవున్రా నా పాట యిన్నాననన్నావుగా ఎక్కడేంటి" అడిగేడు చెలమయ్య.

"కేసెట్టు వచ్చిందిగా - నీకు యివ్వలేదా వాళ్ళు?" ఆశ్చర్యంగా అన్నాడు రాగయ్య.

చెలమయ్యకి అప్పుడర్థమయింది.

"అయితే అదొచ్చినాదన్నమాట! పూర్తయితే పంపుతానన్నాడులే ఆ బాబు. కాస్త అటూ యిటూ గానైనా పంపుతాడు" అన్నాడు చెలమయ్య. అసంతృప్తిని కనిపించనీకుండా.

"సర్లే. ఇంకెక్కడ పంపుతాడు? కేసెట్టు వచ్చి మూడు నెల్లయింది. వెయ్యి దాకా అమ్ముడయ్యాయి కూడ. నా దగ్గరుందిలే. చూడు" అంటూ బ్యాగులోంచి కేసెట్ తీసి పెద్దయ్య చేతిలో పెట్టాడు రాగయ్య.

చెలమయ్యకి అది పట్టుకుని చూస్తేనే ఆనందమనిపించింది. "అచ్చమైన పల్లె పదాలు" అని వుంది ఆ కేసెట్ మీద. ఆ క్రిందనున్న చిన్న చిన్న అక్షరాలు చెలమయ్యకు కన్పించలేదు. కేసెట్‌ని ఆత్రంగా అటూ, యిటూ తిప్పి చూసేడు.

అతనిలోని ఆతృతను గమనించిన రాగయ్య, "మనం యిప్పుడు వినాలంటే దీనికి టేప్ రికార్డర్ వుండాలి. ఈ వూళ్ళో ఎవరికన్నా వుందా?" అడిగేడు.

"లేకేం. కరణంగోరికుంది. రాములోరి గుడి పూజారి కాడా వుంది."

"అయితే సాయంకాలం గుళ్ళో వేద్దాం" అన్నాడు రాగయ్య ఆవులిస్తూ.

"కాస్సేపు పడుకో. లేచినాక మాట్లాడుకోవచ్చు" అన్నాడు చెలమయ్య.

"మరైతే దీనికి డబ్బులేమైనా యిచ్చేరా" అడిగేడు రాగయ్య నిద్రకుపక్రమిస్తూ.

"ఇవ్వకుండా అవుతాదేటి" చెప్పేడు చెలమయ్య.

రాగయ్య మరేం ప్రశ్నించలేదు.

చెలమయ్య కూడా నడుం వాల్చేడు.

తనేమైనా అనుకున్నాడా యిది యిలా వస్తుందని! ఆ రాములోరి కృప వుండి అలా జరిగింది.

ఆర్నెల్ల క్రిందటి మాట...

"భజన పాట చెలమయ్యంటే మీరేనా" అంటూ వచ్చాడో పాతికేళ్ళ కుర్రాడు.

"అవున్నేనే" అన్నాడు చెలమయ్య, అతగాడికి కూచోడానికి బల్ల చూపిస్తూ.

"నాపేరు పరమహంస" అంటూ మొదలెట్టి తనొచ్చిన పని చెప్పేడు.

"ఈ ప్రాంతంలో మీరు గొప్ప పాటగాడని తెల్సింది. చెక్క భజనకూ, చెట్ల భజనకూ మీ పార్టీకీ, ముఖ్యంగా మీకూ, మంచి పేరుంది" అన్నాడతడు –

"ఏదో సిన్నతనంలో నేర్చిన విద్య. ఆలకించిన నలుగురూ ఆనందిస్తే సాలనుకుంటాం. నేను సిన్నతనంలో బడికెళ్ళి అట్టే సదూకోలేదు. ఐదో తరగతితో సరి – ఆ నాలుగచ్చరాలూ, ఆ కాసిన్ని రాగాలూ ఆ సరస్వతీదేవే నా నోట పలికిస్తోంది" అన్నాడు చెలమయ్య వినయంగా.

"మీ తండ్రి తాతలకూ యీ విద్య వచ్చా?"

"వొచ్చును కదండీ! మా చిన్నాన్న మంచి పాటగాడు. మాతాతకైతే యీ జిల్లాలోనే మంచి పేరుండేది!"

"మీ తర్వాత... కొడుకులకెవరికన్నా..."

"నాకు కొడుకుల్లేరు బాబూ. ఇద్దరూ కూతుర్లే. మా తమ్ముడికి మగ సంతానముందిగాని ఆడికి యీ విద్య రాదు."

"మరి మీ తర్వాత మీ కుటుంబంలో యీ విద్య అంతరించి పోవలసిందేనా"

చిన్నవాడైనా చాలా గౌరవంగా మాట్లాడుతున్నాడనిపించింది చెలమయ్యకి.

"రోజులు మారిపోతున్నాయి గదండీ. హరికథ, బుర్రకథలకే గిరాకీ పడిపోనాదండీ - ఈ సినీమాలూ, నాటకాలూ ఒచ్చేయి గదండీ. పంచరంగుల పెపంచాన్ని, యీ కథలన్నిట్నీ కళ్ళకు కట్టినట్లు చూపెట్టేస్తున్నారు గదండీ. మా విద్దేపాటి? ఇప్పుడేనా ఎవులో.... నూటికొక్కళ్లో యిద్దరో మీలాటి మారాజులు సరదాపడితే పాడతా మండి. తర్వాత మా గ్రామ పండుగల్లోనూ, శివరాత్రికీ, సంకురాత్రికీ.... వుండక తప్పదండి."

"మరి ప్రభుత్వం మీలాంటి కళాకారులకేదైనా సహాయం చేస్తోందా? మీ విద్య మీతోపాటే అంతరించిపోకుండా ఏమైనా చేస్తోందా?".

"పెబుత్వమేటి చేస్తాదండి. ఏ కళనేనా ఆదరించేది పెజలేనండి. పెజాదరణ వున్నంతకాలం యివన్నీ వుంటాయండి" చెప్పేడు చెలమయ్య.

"ఇంతవరకూ మీరెన్ని కథలు ఎన్నిమార్లు చెప్పి వుంటారో"

"అబ్బో! యాదస్తు లేదండి. నా ఇరవయ్యో ఏటనుకుంటాను తొలిసారిగా '*రుక్మిణీ కళ్యాణం*' చెప్పేను. తర్వాత *హరిశ్చంద్ర; సీతారామజననం; శ్రీకృష్ణకుచేల; భక్త* రామదాసు.... అలా ఎన్నోనండి"

"ఈ మధ్య కూడా మీరు..."

"ఓ... క్రితం శివరాత్రికి పకీర్సాపేటలో యిచ్చేమండి. తర్వాత లేదు"

"మరీ... మీ తరం తర్వాత తర్వాతి రోజుల్లో మీ పాటలూ, భజనలూ, కథలూ వుండవంటే బాధగా వుండదూ మీకు?"

"ఎందుకుండదండీ. వుంటాది - కాని చేసేదేం వుందీ?"

"వుంది. నేనందుకే అంత దూరం నించి మీ దగ్గరకి వచ్చేను. ఇప్పుడు నాగరికత పెరిగింది. విజ్ఞానం పెరిగింది - పాటల్నీ మాటల్నీ అపురూపంగా దాచిపెట్టి ముందు తరాలవారికందించే మార్గాలున్నాయి. టేపులూ, డిస్కులూ వచ్చేయి. మీ పాటల్ని అలాగే భద్రం చేయవచ్చు. మీ గొంతును ఎన్నేళ్ళయినా సజీవంగా వినేట్లు వుంచొచ్చు. కేసెట్ల గురించి మీరు వినే వుంటారు"

"విన్నానండి. సినీమా పాటలొస్తున్నాయి గదండీ. రాములోరి గుళ్ళో వేస్తారు"

"సినీమా పాటలే కాదు - ఇప్పుడు మేం మీలాంటి కళాకారుల సహకారంతో హరికథల్నీ, బుర్రకథల్నీ కూడా టేపుల్లోకి తీసుకొచ్చేం" అంటూ తను తెచ్చిన చిన్న పెట్టె తెరిచి నాలుగైదు కేసెట్లనూ, ఓ చిన్న టేపు రికార్డర్‌నూ బయటకు తీసేడు.

చెలమయ్య కిదంతా ఎందుకో ఏమిటో అర్థం కాలేదు. అతగాడు తను తెచ్చిన నాలుగు కేసెట్లనీ రికార్డర్ మీద కొంచెం కొంచెం వేసి వినిపించేడు. హరికథ, బుర్రకథ,

ఒగ్గుకథ – ఎవరెవరివో వున్నాయి. అన్నీ విన్నాడు చెలమయ్య.

"విన్నారు కదా. ఇప్పుడు మీ పాటల్ని కూడ ఇలా టేపుల కెక్కించి భద్రపరచాలనే నా ఉద్దేశం. మన పాత జానపద పాట, పదం, సంగీతం అంతరించిపోకూడదు. అది ముందు తరాల వారికి తెలియాలి – అందుకు మీలాంటివారి సహాయం నాకు కావాలి" అన్నాడు.

"నా సాయమా? నేనేం చెయ్యగలను బాబూ!" ఆశ్చర్యపోయేడు చెలమయ్య.

"మీరు చెయ్యగలిగేదే. ముప్పావు గంటకు మించకుండా రెండు మంచి కథల్ని లేదా మీకు తోచిన జానపద పాటల్ని మీరు మీ బృందంతో కల్సిపాడాలి. మీ పాటల్ని టేపు చేసేందుకు కంపెనీ వార్ని ఒప్పించేందుకు నేను నా శాయశక్తులా కృషి చేస్తాను. నా కృషి సఫలమైతే ఆంధ్రదేశమంతా మారుమూల ప్రాంతాల్లో సైతం మీ పాట మార్మోగిపోతుంది – కొన్నేళ్ళపాటు మీ పాట జనం గుండెల్లో నిలిచిపోతుంది"

అతను చెప్పేది వింటూంటే చెలమయ్యకి ఆనందంలో తేలిపోతున్నట్లనిపించింది ఈ రోజుల్లో కూడ తను పాడుకునే లొల్లాయి పాటలేమిటీ... టేపుల కెక్కడమేమిటి? అదృష్టం యీ పిల్లగాడి రూపంలో తన తలుపు తట్టిందా అన్పించింది.

"అంతా మీ దయ బాబూ" అన్నాడు ఆనందంతో గొంతు పూడుకుపోతుండగా.

"నాదేముంది? మీ పాట... ఆ కంపెనీ వారి మదుపు – అనుసంధానకర్తనే నేను – అయితే వారం రోజుల్లో మళ్ళీ వస్తాను. అప్పటికి మీరు మీ బృందంతో సహా రెడీ అవండి. మీమీ వాయిద్యాలను సిద్ధం చేసుకోండి. ముందు మీ పాట నేను వినాలి – నాకు నచ్చితేనే ఆ కంపెనీ వారికీ నచ్చేది"

పరమహంస చెప్పిన వాటికి ఆనందంతోనే తలూపేడు చెలమయ్య.

చెప్పినట్టుగానే వారం రోజుల్లోనే వచ్చేడు పరమహంస. ఆనాటి సాయంకాలం రామకోవిల్లో చెలమయ్య తన బృందంతో పాటలు విన్పించడానికి సిద్ధమయ్యేడు. విషయం తెల్సి కొద్దిపాటి జనం కూడ పోగయ్యారు. అప్పుడప్పుడు నాటకాల్లో వేషాలు వేసే కరణంగారి అబ్బాయి హుషారుగా ముందుండి పరమహంసకు కుర్చీ వేసి తనను తాను పరిచయం చేసుకుని బిస్కెట్లూ, కూల్‌డ్రింకూ యిచ్చి మర్యాద చేసేడు. దీపాలు పెట్టే వేళకి అంతా సిద్ధమైంది.

*"రాముడడుగో కొనియాడరారే*
*కోదండ రాముడడుగో..."* అంటూ మొదటి పాటకు తన గళాన్ని సవరించేడు చెలమయ్య.

స్తబ్ధుగా వున్న గాలిలో చైతన్యం ప్రవేశించినట్లయింది. అటు యిటు పోయేవారు కూడ ఆసక్తిగా చేరేరక్కడ. ఆ మనిషిని చూసి అతనితో మాట్లాడిన వారు కూడా అతగాడు పాటందుకుంటే ఆశ్చర్యపోవలసిందే.

*"ఇనవంశ కుల తిలక వనజాక్షి నీ వరుడు*
*రామచంద్రుడు పంపెనూ... జానకీదేవీ*

*మోమెత్తి చూడవమ్మా...*

*అనుమాన పడవలదు నీ పాద సేవకుని*

*పగవాన్ని కాను తల్లీ ఓ సీతమ్మ*

*పదవిచ్చినను పంపుమా..."* అనే పాటతో చుట్టు పక్కల యిళ్లలోని యిల్లాళ్ళు పిల్లాపాపలతో వచ్చి చేరేరు. అక్కడి జనానికి చెలమయ్య పాటే ఆనందం. పిలుపులక్కర లేదు వారికి.

పాటలు సాగుతున్నాయి. బృందానికి నచ్చిన పాటలు.. జనం మెచ్చిన పాటలు.

*"వడిగాలి పుత్రుడా ఓ ఘనుడ హనుమంత*

*సంజీవికే వెళ్ళుమా శ్రీ హనుమంత ద్రోనాద్రికే వెళ్ళుమా*

*ఇక్కడకు ద్రోనాద్రి ఇల మూడు లక్షలు*

*మధ్య త్రోవల యందు మాయ రాక్షసులుందు*

*మాయ చేసీ నిన్ను మరపించబోతారు*

*ఆ పర్వతమునందు అన్నీ మందులు కలవు*

*గంధర్వ రాజులు ఘనులు వారుంటారు*

*వడిగాలి పుత్రుడా ఓ ఘనుడ హనుమంత...."*

లయాత్మకంగా సాగే ఆ పాట సందెగాలిలో కలిసి బయళ్లలోకి పరుగులు తీసింది. - అంతే! పొలం నించి వచ్చే రైతన్నలకది ఉత్సాహాన్ని కలిగించింది. ఆకర్షితులైనవారంతా అలుపెరుగక అక్కడ పోగయ్యారు. రామకోవిల ఆవరణంతా జనంతో కలకలలాడుతూ కన్పించింది - జనాన్ని చూసిన చెలమయ్య వదనంలో ఆనందం పొంగు కొచ్చింది. అతని గొంతులోంచి వెలువడ్డ ప్రతి ధ్వనీ రాగమైంది. ప్రతిరాగం కొత్తగా మెలి తిరిగి పాత పాటనే కొత్తగా విన్పించసాగింది.

*"వచ్చేవారెవరు చూడుమా అంజని తనయా...*

*మహాముని పుంగవులు దారి తప్పి వచ్చినారా...*

*చేతులొగ్గి దండమిడి వద్దకు గైకొని అమ్మా"*

చెలమయ్య బృందానికి ఆనందం హద్దులు దాటింది. రామకథలోని పాటలు ముందు వెనుకలైనా జనం ఆనందించేలా... మైమరచిపోయేలా గాలితరంగాల్లో లీనమైపోతు న్నాయి. అలా ఎన్ని పాటలో! ఎన్ని భజన సంగతులో!

జనాన్నీ, చెలమయ్యనీ పరమహంస విస్మయంతో చూడసాగేడు.

చెలమయ్య మళ్ళీ మరో పాట నందుకున్నాడు.

*"శివుడా శంకరుడా... సిగ చంద్ర ధరుడా*

*వందనముగైకోని సందేహమూ తీర్చుమా*

*కుక్షిలోనున్నట్టి లోకాలను రక్షింప*

*కంఠమందే నీవు గరళముగ్గాబట్టి*

కాచినాదేవరా కైలాస గిరిహరా
వందనము గైకోని సందేహమూ తీర్చు
నీకన్న ఘనుడా ఆ నీలాల రాముడు..." ॥శివుడా॥
.... .... .... .... ....
"వినవే హైమవతీ... వినవే రాముని కీర్తి
వినవే దక్షుని పుత్రి... వినవే మంగళగాత్రి" ॥వినవే॥

దొంతర దొంతరలుగా యధేచ్ఛగా చెలమయ్య పాట సాగుతోంది. చుట్టూ పరచుకున్న పున్నమి వెన్నెల! పరమహంస లేచేడు. చివరి బస్సు తొమ్మిదింటికి. పాట ఆగింది. పరమహంస వెనకే చెలమయ్య కదిలేడు.

"మీ పాట నాకు నచ్చింది. డబ్బు పెట్టుబడి పెట్టేవారికీ నచ్చాలిగా మరి! వారిని ఒప్పించే ప్రయత్నం తప్పకుండా చేస్తాను. మీకు వివరంగా ఉత్తరం రాస్తాను" అంటూ బసెక్కబోతూ చెలమయ్యను దగ్గరగా పిల్చి ఏదో చెప్పి వెళ్ళిపోయాడు పరమహంస.

◆ ◆ ◆

"ఇక తర్వాతేముందీ? పరమహంస రాసిన ఉత్తరం ప్రకారం మీరు పట్నం వెళ్ళి వుంటారు – అతగాడు మీ పాటల్ని స్టూడియోలో రికార్డు చేయించి వుంటాడు. మీ పేర్లూ వివరాలూ తీసుకుని మీ అందరిచేతా ఒక కాగితం మీద సంతకాలో, వేలిముద్రలో పెట్టించుకుని వుంటాడు. కేసెట్లు మార్కెట్లో విడుదల అయ్యేక మీకు పంపుతామని వుంటాడు. అవునా?" అన్నాడు రాగయ్య పొలం గట్టు మీద చెలమయ్య పక్కనే నడుస్తూ అతను చెప్పింది విని –

"అదంతా నీ కెట్టా తెల్సూ" ఆశ్చర్యపోయేడు చెలమయ్య.

"నేనలాటి కేసెట్ కంపెనీలోనే పనిచేస్తున్నాను కనుక. ఆ కేసెట్లు వూరూరా పంపిణీ చేసేదీ నేనే కాబట్టీ" అన్నాడు రాగయ్య.

రాగయ్య ఉద్యోగరీత్యా నెలలో ఇరవై రోజులు వూళ్ళో ఎందు కుండడో అప్పుడర్థమైంది చెలమయ్యకి.

జేబులోంచి కేసెట్ తీసి, "ఇతగాడేనా నీ దగ్గరకొచ్చిన పరమహంస?" అంటూ కేసెట్ మీది ఫోటోను చూపించేడు.

"అవును కుర్రాడేగాని, మా దొడ్డమనసాయనది" అన్నాడు చెలమయ్య. కాస్సేపాగి, "అవునూ. మా వోళ్ళ పేర్లన్నీ ఏసినారా అందుమీద?" అడిగేడు.

"ఎంత అమాయకుడివి పెద్దయ్యా. అందరి పేర్లూ వేయడానికి వాళ్ళేం వెర్రివాళ్ళా? చౌడువాడ చెలమయ్య బృందం అని వేసేరు చాలదా?"

చెలమయ్య ముఖం ఒక్కసారి చిన్నబోయింది. "అదేట్రా చిన్నా – అందరూ పాడినాము గాదా... వాళ్ళ పేర్లు కూడా వేసుంటే.."

"ఇంకా నయం. అద్దైనా వేసేరు. అవునూ. నువ్వు దొడ్డ మనసని పొగిడే ఆ పరమహంస ఫోటో ఎందుకని అడగవేం?"

చెలమయ్య మాట్లాడలేదు.

"మీ పాట కాతడు సంగీతం కూర్చేడట - నిర్వహించేడట. బాగుందా?"

"మా పాట తరతరాల్నించీ వస్తున్న పాట - దానికతడు సంగీతం కూర్చేదేముంది? మా రక్తంలో రక్తంగా మా జీవితాల్లో వెలుగ్గా కలిసిపోయిన పాటది" అన్నాడు చెలమయ్య.

"మరందుకే నిన్ను అమాయకుడన్నది. ఏ లాభమూ లేకుండా ఎవరు పెద్దయ్యా నీ పాటల్ని కేసెట్లు చేసేదీ? అంతా యాపారం పెద్దయ్యా, యాపారం! ఆ రెండో ఫొటో చూశావా. అతగాడు డబ్బు మదుపుపెట్టినాయన. మూణ్ణెలు తిరక్కుండా పెట్టిన మదుపు తెచ్చేసుకుని లాభాలార్జిస్తున్నాడు. ఆ లాభాల్లో కొంత వాటా పరమహంసకి కూడ వుందంటే నమ్ముతావా?"

రాగయ్య చెప్పిన సత్యాన్ని అరాయించుకోలేకపోతున్నాడు చెలమయ్య.

"డబ్బు పెట్టినోడు లాభం పొందితే పొందనీ - దాంతోపాటు పాటగాళ్ళని కూడ కొంత సంతోషపరిస్తే బాగుంటాది గదా" అన్నాడు.

"మరి మీకు డబ్బు యివ్వలేదా? ఇచ్చేరన్నావు గదా" అన్నాడు రాగయ్య ఆశ్చర్యంగా.

చెలమయ్య చటుక్కున నిలదొక్కుకున్నాడు.

"అదిగాదు నేనన్నది. ఆ ఖాళీ డొక్కుకు ప్రాణం పోసిన పాటగాళ్ళ పేర్లు కూడ అందుమీదేస్తే ఏం పోయేదీ? అని" అన్నాడు.

- అలా మాట్లాడుకుంటూ రామకోవిల వరకూ వచ్చేశారు.

గుళ్ళో దీపాలు పెట్టేరు - గంటలు విన్పిస్తున్నాయి.

"ఇక్కడ రికార్డు ప్లేయరు వుందన్నావుగా. కేసెట్ వేద్దామా?" అడిగేడు రాగయ్య.

"ఎందుకులే. తర్వాత అంతా కలిసే వింటాం. పొద్దుపోయింది గదా యింటికి పోదాం" అన్నాడు చెలమయ్య. కొన్ని నిజాలు తెలియడంతో మనసులో ఏదో బాధ మెలితిప్పుతోందతనికి -

ఆ రాత్రి చెలమయ్యకి ఒకంతట నిద్రపట్టలేదు. ఇన్నేళ్ళయి పాట పాడుతున్నా ఎప్పుడూ యిలా మోసపోడం జరగలేదు. రాగయ్యకా డబ్బు సంగతి చెప్పలేదు గాని చెప్పి వుంటే ఎంత పరువు తక్కువ! బస్సెక్కుతూ ఆ రోజు పరమహంస తనతో చాటుగా చెప్పిన మాట తనకు గుర్తే! ఆ కేసెట్ కంపెనీవార్ని ఒప్పించే బాధ్యత తనదేనన్నాడు. అయితే మీ బృందం తరఫున ఓ రెండు వేలైనా యివ్వాల్సి వుంటుందన్నాడు - ఆ డబ్బు పట్నం వచ్చినపుడు తెచ్చినా చాలన్నాడు. తెలుగుదేశంలో మీ పాట మార్మోగి పోతుందన్నాడు - డబ్బు కోసం వెనక్కు తగ్గితే మళ్ళీ యీ అవకాశం రాదన్నాడు. -

ఆ రాత్రే సంగతి అందరికీ చెప్పేడు. కనీసపక్షంగా తలా ఓ రెండొందలేనా వేసుకోవాలి. పాటంటే పాడతారు గాని అందరూ సన్నకారు రైతులే - ఎప్పటికప్పుడే దినం గడిస్తే చాలనుకునే రకానికి చెందినవారు. ఆ కళామతల్లి తమను కరుణించబట్టి ఏడాదిలో, నాలుగైదు మార్లయినా గజ్జకట్టి నోరు విప్పితే రెండు మూడొందలొచ్చేవి! మనసుకు ఆనందమూ, శరీరానికి ఉత్సాహమూ.

"నానిచ్చుకోలేను. నన్నొదిలేయండి" అన్నాడు కాసారపు తాతలు అంతా విని.

"నాకూ కష్టమే. ఇదేమన్నా వెనక్కి వచ్చేదా చచ్చేదా" అన్నాడు పైడయ్య.

"ఈ ముక్క తొలిమారొచ్చినప్పుడే చెప్పొచ్చుగా" నాగిరెడ్డి తప్పు పట్టేడు.

అందరికీ డబ్బు యిచ్చుకుని పాట పొద్దం ఇష్టంలేదనే విషయం తెలిసేక మరేం మాట్లాడలేకపోయాడు. తనే ఏ అప్పో సప్పో చేసి ముందుకు వద్దామన్నా అప్పిచ్చేనాథుడు లేడు. అలా చప్పబడిపోయిన ఉత్సాహం పరమహంస నించి ఉత్తరం వచ్చేక మళ్ళీ అందర్లోనూ ఊపిరిపోసుకోనారంభించింది. అప్పటికి నాల్రోజులు టైముంది. విషయం తెల్సినా రెండ్రోజులు ఎవరూ ఏం మాట్లాడలేదు. మూడోరోజు ఉదయం ముత్యాలు వచ్చేడు చెలమయ్య దగ్గరికి.

"డబ్బు యిబ్బంది మనకెప్పుడూ ఉన్నదే. మనమేం చదూకున్నామని మన పాట ఏపాటిదని ఆళ్ళు మనకాడికొచ్చారు? మనమున్నా లేకపోయినా మనపాటుంటాది. అంచేత - మీరంతా ఏటంటే నేనూ అదే-" అన్నాడు.

నెమ్మది నెమ్మదిగా ఆ సాయంత్రానికి అందరూ అదే అభిప్రాయానికి వచ్చేరు. అంతా బాగానే వుంది. కానీ అందరికీ అప్పే కావాలి. కరణం గారబ్బాయి ముందుకొచ్చి అందర్నీ మున్సబుగారి దగ్గరకు తీసుకెళ్ళాడు.

అంతావిని, "మన వూరికీ, మనోళ్ళకూ పేరొస్తుందంటే అంతకన్నానా. మంచి పనికి నెనెప్పుడూ ముందుంటాను. అయితే ఏడాదిలోగా తీర్చేయాలి. వడ్డీ మాత్రం తగ్గదు సుమా" అన్నాడు మున్సబు.

ఈ సంగతంతా రాగయ్య తనవాడైనా చెప్పబుద్ధి కాలేదు చెలమయ్యకి. పట్నాల్లో మోసాలుంటాయని తెల్సు. దగాలుంటాయని తెల్సు - దొంగతనాలు, హత్యలూ వుంటాయని తెల్సు. అటువంటివి తమ వూరి పొలిమేరల దాకా యింకా రాలేదనుకున్నారు. కానీ...

చెలమయ్య బాధగా నిట్టూర్చాడు. ఇదంతా తనవల్లే జరిగిందేమో... తనొప్పుకుని వుండకపోతే తమని పావులుగా వాడుకుని అతగాడంత మోసం చేసేవాడు కాదేమో - ఆలోచనలతో ఎప్పుడో నిద్రపోయాడు.

మర్నాడుదయం రాగయ్య వెళ్ళిపోతూ, "అయితే యీ కేసెట్టు నీ దగ్గరుండనీ పెద్దయ్యా" అంటూ అందించేడు.

చెలమయ్య అందుకోలేదు. అది తన గొంతు నించి బయటపడి గాల్లో కలిసిపోయిన పాట.

"ఎందుకులే - అతగాడు పంపుతాడు. కాస్త ఆలస్యమౌతాదంతే. ఇది నీ దగ్గరే వుండనీ." అంటూ గుమ్మం దాటి, "పద నేనూ నీతోపాటు ఆ రాములోరి గుడి దాకా వస్తాను" అన్నాడు.